క్లుప్తంగా

విద్యార్థులకు క్విజ్ పోటీలు



సామర్లకోటలో బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సామర్లకోట: స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం తోటకూర సాయి రామకృష్ణ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.రాజు, జి.గోవిందు, కేవీవీ సత్యనారాయణ, ఏఎల్‌వీ కుమారి, జి.శంకర్, ఎ.శ్రీవల్లి, జి.బాలశైలజ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కొత్తపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారే సుధ అధ్యక్షతన బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని ఎంపీడీఓ పి.వెంకటనారాయణ మంగళవారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు తన ప్రగతి నివేదికతో హాజరుకావాలని తెలిపారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ దుర్గాప్రసాద్

సామర్లకోట: నేటి సాంకేతిక యుగంలో నేరాలు పెరిగిపోతున్నాయని వాటి పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ కె.దుర్గాప్రసాద్ అన్నారు. స్థానిక బలుసులపేట అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద ప్రజలతో పోలీసు మైత్రీ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఆన్‌లైన్‌లో సైబర్ నేరాలు పెరిగి పోయాయని వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. యువత చెడు మార్గాలకు అలవాటు పడుతున్నారని, తల్లిదండ్రులు వారిని గమనించాలన్నారు. పిల్లలకు మోటారు సైకిళ్లు ఇవ్వడం, సెల్ ఫోన్లు ఇవ్వడం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమానికి 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు అధ్యక్షత వహిస్తూ వార్డులో ప్రతీ రోజు పోలీసుల గస్తీ తిరగాలని సూచించారు.

హిందూ ధర్మ రక్షణే జీవిత లక్ష్యం

దివ్యానంద సరస్వతి స్వామీజీ



సమావేశంలో మాట్లాడుతున్న దివ్యానంద సరస్వతి స్వామీజీ

పిఠాపురం: హిందూ ధర్మరక్షణే జీవిత లక్ష్యంగా హిందువులు ఉండాలని మన సంస్కృతి సంప్రదాయాలను రక్షించుకోవాలని దివ్యానంద సరస్వతి స్వామీజీ పిలుపునిచ్చారు. స్థానిక గోపాల్‌బాబా ఆశ్రమంలో మంగళవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పిఠాపురం మండల హిందు సమ్మేళనంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. భారతదేశం ప్రపంచానికి నాగరికత నేర్పిందన్నారు. శాంతిని కోరే మన దేశానికి విదేశీ మతాలు వ్యాప్తి చెంది భారతీయ సంస్కృతిని సంప్రదాయాలను నాశనం చేస్తున్నాయని, వాటిని ప్రతీ ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. మన దేశం పేరు భారతదేశం అని ఇండియా కాదని బ్రిటీష్ వారు పెట్టిన పేరు మనకొద్దన్నారు. బ్రిటీష్ వారి మతాలను దూరం పెట్టాన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరి విభాగ ప్రచారక్ తోట జగన్నాథం, వ్యవస్థాపక ప్రముఖు పెమ్మిరాజు రామచంద్రరావు జిల్లా సహ కం బాల నారాయణరావు, జిల్లా ప్రచారక్ పడాల రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శోభాయాత్ర నిర్వహించగా పలువురు ఘనంగా స్వాగతం పలికారు.

దుర్గమ్మకు 108 రకాల పిండి వంటల నివేదన

లక్ష గాజులతో అలంకరణ



దుర్గామాతకు 108 రకాల పిండి వంటలతో నివేదన

పిఠాపురం: కార్తికమాసం తొలిరోజు గొల్లప్రోలు కరణంగారితోటలో ఉన్న కనకదుర్గమ్మకు 108 రకాల పిండి వంటలతో మహా నివేదన చేశారు. లక్ష గాజులతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.



పాదగయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పాదగయ పుష్కరిణిలో కార్తిక దీపాలు వదులుతున్న భక్తులు

కార్తికం కమనీయం..!

- కార్తికమాసం ప్రారంభంతో భక్తుల సందడి
- కళకళలాడిన ఆలయాలు

పిఠాపురం: పవిత్రమైన కార్తికమాసం కనుల పండువగా ప్రారంభమైంది. తొలిరోజు మంగళవారం స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి ఆలయం చేరుకుని పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. పాదగయ పుష్కరిణిలో కార్తిక దీపాలను వెలిగించారు. ఉమా కుక్కుటేశ్వరస్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో శివలింగాలకు పాదగయ పుష్కరిణిలో నీటిని తీసుకువచ్చి స్వయంగా అభిషేకాలు చేశారు. స్థానిక పురుహూతిక అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేసి భక్తులు కార్తిక దీపాలను దానం చేశారు.

ఆరంభమైన కార్తికం

పెద్దాపురం: కార్తికమాసం ఆరంభం కావడంతో పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మంగళవారం వేకువ జామున నుంచి శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అత్యంత భక్తి శ్రద్ధలతో శివనామ స్మరణ చేస్తూ భక్తులు దేవాలయాల వద్ద బారులు తీరారు. వేకువ జామునే మహిళలు ఆయా నదీ పరివాహక ప్రాంతాల్లో దీపాలను వెలిగించి భక్తిశ్రద్ధలతో కార్తిక మాస ఆరంభ పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీవిశ్వేశ్వర, శ్రీ చంద్రశేఖర స్వామివార్ల ఆలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కట్నం జగన్మోహన శ్రీనివాస్, ఆలయ అర్చకులు విప్పర్తి కృష్ణతేజ వర్మల ఆధ్వర్యంలో కార్తిక మాసోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.



పాదగయక్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి తొలి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

కార్తిక మాస ఉత్సవాలు ప్రారంభం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామభీమేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తిక మాస ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. తెల్లవారు జామున గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. ఈఓ డి.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, కొంతేటి జోగారావు, సన్నిధిరాజు వెంకన్న, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. భక్తుల ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజలు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.



కార్తిక మాసం పూజలు నిర్వహిస్తున్న మహిళలు



పూజలందుకున్న కుమారరామ భీమేశ్వరస్వామి

నెహ్రూ జీవితం ఆదర్శం

సామర్లకోట: పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొవాలని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు అన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నెహ్రూ స్వాతంత్ర పోరాటంలో పాల్గొని అనేక పర్యాయాలు జైలు జీవితం అనుభవించాడని తెలిపారు. స్వాతంత్రం వచ్చిన తరువాత మొట్టమొదటి ప్రధానిగా ప్రజలకు మెరుగైన పాలన అందించి ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. పంచవర్ష ప్రణాళికలతో దేశ ప్రగతికి బాట వేశారని సుబ్బారావు తెలిపారు. ఆయన జీవిత చరిత్రను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, పిఠాపురం ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు పాల్గొని నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఘనంగా బాలల దినోత్సవం

పెద్దాపురం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పెద్దాపురం భవిత సెంటర్, మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. భవిత సెంటర్ ఇన్‌చార్జి దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, ఎంఈఓలు ప్రభాకరశర్మ, చౌదరి పాల్గొన్నారు. అనంతరం 12 మందికి దివ్యాంగ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ వెంకటలక్ష్మి, పాఠశాల హెచ్ఎం శివజ్యోతి పాల్గొన్నారు.

శాంతివర్ధనలో...

పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ రాయవరపు సత్య మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు.

కష్టపడితేనే ఉన్నత స్థానం

పెద్దాపురం: కష్టపడి విద్యనభ్యసిస్తేనే ఉన్నత స్థానాలు సాధించవచ్చని పెద్దాపురం సీఐ రవికుమార్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో స్కూలింపిక్స్ (బాలల దినోత్సవం) మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ అధ్యక్షతన జరిగిన వేడుకలో సీఐ రవికుమార్ మాట్లాడారు. పాఠశాల డైరెక్టర్ విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ నేటి పెద్ద స్థాయిలో ఉన్న వ్యక్తులందరూ నాడు బాలలే అన్నారు. సీనియర్ ప్రిన్సిపాల్ మూర్తి, ప్రొఫెసర్ సంతానం, అకడమిక్ అండ్ కల్చరల్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో నెహ్రూ విగ్రహానికి నివాళులు అర్పించిన సుబ్బారావు తదితరులు



శాంతివర్ధనలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులు

ఆటల పోటీలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చెందుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. స్థానికులు బడిగంటల రవికుమార్ ఆర్థిక సహాయంతో విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ అల్లి పాప, అల్లి నూకరాజు, ఉప సర్పంచ్ కోనేటి సుధా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్ సీపీ విజయానికి నాంది

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జరుపుతున్న సంక్షేమం, అభివృద్ధి పాలనే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలుకుతుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, నియోజకవర్గ పరిశీలకులు గిరిజాల బాబు అన్నారు. పెద్దాపురం పట్టణంలోని రెండవ సచివాలయ పరిధి సత్తెమ్మ కాలనీలో మంగళవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హౌసింగ్ చైర్మన్ దొరబాబు, గిరిజాల బాబు మాట్లాడుతూ ప్రజలకు నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి ప్రతీ ఒక్కరూ గుర్తించి రెండవ దఫా వైఎస్సార్ సీపీ విజయానికి నాంది పలకాలని ఆయన కోరారు. రెండవసారి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు మరింత లబ్ధి చేకూరుతుందని దొరబాబు అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు. వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అదనంగా పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతీ ఇంటికి సంక్షేమాన్ని అందచేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీది అన్నారు. అనంతరం ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ప్రజలకు జరిగిన సంక్షేమం, అభివృద్ధిపై వివరించారు. తొలుత పార్టీ జెండా, సంక్షేమం, అభివృద్ధి బోర్డును దొరబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, తలారి ధర్మేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు, గృహ సారథుల పట్టణ కన్వీనర్ చింతా శ్రీనివారావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సంక్షేమం, అభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న దొరబాబు

సంక్షేమాభివృద్ధి పథకాలతో ప్రజలకు మేలు

సామర్లకోట: సంక్షేమాభివృద్ధి పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ సంక్షేమంతోనే అభివృద్ధి అని నిరూపించిన గొప్ప నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అటువంటి వ్యక్తి జీవిత కాలం సీఎంగిఆ ఉండాలని ఇదే విషయాన్ని ఇంటింటా ప్రజలకు వివరించారు. వ్యవసాయాన్ని పండగగా మార్చి రైతును రాజుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికలల్లో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారని తెలిపారు. నవరత్నాలను ప్రకటించి వాటిని అమలు చేశారన్నారు. ప్రతీ ఒక్కరికి ఆనందాన్ని పంచాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికలల్లో 175 స్థానాలలోను విజయఢంకా మోగించడం ఖాయమని అన్నారు. పుట్టిన బిడ్డ నుంచి చనిపోయే వారి వరకు అనేక పథకాలు అమలు జరుగుతున్నాయని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొన లేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, దీనికి ఎల్లో మీడియా సహకరిస్తోందన్నారు. సచివాలయం పరిధిలో లబ్ధిదారుల జాబితా బోర్డును దొరబాబు ఆవిష్కరించి పార్టీ జెండా ఎగురవేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, గ్రామ సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు, సొసైటీ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని, ఉటా వాసు, సచివాలయ కార్యదర్శుల, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సామర్లకోట లో సంక్షేమ జాబితా బోర్డును ఆవిష్కరించిన చైర్‌పర్సన్ తదితరులు

'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే' ప్రారంభం

సామర్లకోట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు మరింత చేరువ చేయడానికి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. మంగళవారం స్థానిక మణుగులదిబ్బ 5వ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ మేరకు సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాలు అందుకున్న లబ్ధిదారుల జాబితా బోర్డును ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ అన్ని సచివాలయాల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. దీనిలో భాగంగా సచివాలయంలో వెల్ఫేర్ స్కీమ్ బోర్డులను ఆవిష్కరించామని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిన వారి అభిప్రాయాలను సేకరిస్తామన్నారు. పథకాలు రాని వారు ఉంటే గుర్తిస్తామని చెప్పారు. కార్యక్రమం ముగిసిన వారం రోజుల్లో వలంటీరు వచ్చి, అర్హులై పథకాలు రాని వారి వద్ద నుంచి దరఖాస్తులు తీసుకుంటారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రదేవి, కౌన్సిలర్లు మర్రి శేషారావు, పాలిక జట్ల మోహన్, కుసుమచంటి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు, జేసీపీ కన్వీనర్ ఇరుసుమల్ల సాయి పాల్గొన్నారు.



సంక్షేమ అభివృద్ధి బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కొత్తపల్లి: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ అన్నారు. అమీనాబాదు గ్రామ సచివాలయం-2 వద్ద మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్‌లకు పార్టీ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం సచివాలయంలో అభివృద్ధి సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. సాయిబాబా గుడి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులతో కలిసి ఇంటింటికీ తరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచ్ నక్కా మణికంఠబాబు, నాయకులు నక్కా తాతారావు పందిరి బాపిరాజు, తొమ్మండ్ర సురేష్, తేలు వెంకట లెనిన్, గిడుతూరి నూకబాబు, సిద్ధి సత్యనారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

సామర్లకోట: గ్రంథాలయాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పట్టణంలోని గ్రంథాలయంలో ఆమె మంగళవారం ప్రారంభించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంత్రి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయానికి సొంత భవనం నిర్మాణం చేసుకునే విధంగా స్థలం కేటాయిస్తామని చెప్పారు. రెండో అంతస్తులో అద్దె భవనంలో గ్రంథాలయం నిర్వహించడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు హాజరయ్యే అవకాశం లేదన్నారు. గ్రంథాలయ సంస్థ నుంచి నిధులు రప్పించుకుంటే, సాధారణ నిధుల నుంచి గ్రంథాలయ భవనం నిర్మాణానికి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్ మాట్లాడుతూ అనేక మంది యువకులు గ్రంథాలయంలో చదువుకుని అభివృద్ధి సాధించారన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న స్థలం గ్రంథాలయానికి అనువుగా ఉంటుందని అన్నారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత, కోఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెరుగుతుందని తెలిపారు. పుస్తకం చదవడం ఒక కళ అని పేర్కొన్నారు. గ్రంథాలయాధికారిణి బందిల రత్నమణి మాట్లాడుతూ మున్సిపాలిటీ స్థలం కేటాయిస్తే గ్రంథాలయ సంస్థ నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ నెల 20 వరకు గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. కౌన్సిలర్ పిట్టా సత్యనారాయణ, మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్, సీనియర్ ఉపాధ్యాయుడు కెనడీ, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ వెనుక భాగంలో ఉన్న స్థలాన్ని చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యులు పరిశీలించారు. వేట్లపాలెం గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులు అర్పించి సరస్వతిదేవికి పూజలు చేశారు.



సామర్లకోటలో గ్రంథాలయంలో వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించిన చైర్‌పర్సన్ తదితరులు

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

పెద్దాపురం: రాష్ట్రంలోని గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, కౌన్సిలర్ తాటికొండ వెంకటలక్ష్మి అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం స్థానిక ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు. తొలుత వారు జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోస్యుల కృష్ణబాబు, చల్లా విశ్వనాథం పాల్గొన్నారు. వారోత్సవాలను జిల్లా గ్రంథాలయ పరిషత్ సభ్యులు జీను మహేష్‌బాబు, గ్రంథాలయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేములపల్లి రవికుమార్ పరిశీలించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.



సభలో ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్మన్ తులసీ మంగతాయారు

బాలల దినోత్సవం

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో బాలల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. వైస్ ప్రిన్సిపాల్ పరశురామయ్య, విద్యాలయ లైబ్రరియన్ రాజ్యలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వార్షికోత్సవాలు

కొత్తపల్లి: ఉప్పాడలో ఉన్న గ్రంథాలయాంలో మంగళవారం వారోత్సవాలు నిర్వహించారు. బాలల దినోత్సవం సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులు అర్పించారు. మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రంథాలయ అధికారి టి.నళినీప్రియ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు మూలపేట విద్యార్థి

కొత్తపల్లి: మూలపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి బొడ్డు చంద్రశేఖర్ పిఠాపురంలో ఆర్ఆర్‌బీహెచ్ఆర్‌లో జరిగిన రాష్ట్రస్థాయిలో జరిగిన సాఫ్ట్ టెన్నిస్-19 బాలుర విభాగంలో ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు ముదిలి హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో చంద్రశేఖర్‌ను సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ త్వరలో ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో రాజ్‌పూర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్టు తెలిపారు. శిక్షణ ఇచ్చిన హరిబాబు, డి.సునీత, డి.ప్రసన్న కుమార్‌లను అభినందించారు.



చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న దృశ్యం

ప్రపంచ శాంతికి ఆధ్యాత్మికత అవసరం

పెద్దాపురం: ప్రస్తుత సమాజంలో ప్రపంచ శాంతికి ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంచుకోవాల్సిన అవసరం ఉందని శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల డైరెక్టర్ రాయవరపు వీరబాబు, క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల వ్యవస్థాపకుడు నంగిన సత్యానందం, ప్రముఖ వైద్యులు చిర్రావూరి గంగారావు (దత్తుడు) అన్నారు. ప్రపంచ శాంతికై క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే 'ఏసు కొరకు నడక' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్దాపురం మండలం తిరుపతిలో 'వాక్ ఫర్ జీసస్' మహిళల ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ గాస్పల్ మినిస్ట్రీస్ (సీజీఎం) వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీనుద్దేశించి వారు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరిస్తే ప్రపంచంలో శాంతి నెలకొంటుందన్నారు. నంగిన సత్యానందం మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం ప్రపంచ శాంతికి ఏసు కొరకు నడక కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కరోనా కారణంగా రెండేళ్లు నిలిపివేశామన్నారు. ఎనిమిదవ ఏట తిరుపతి నుంచి ర్యాలి ప్రారంభమై దివిలి, పులిమేరు, గుడివాడ, సిరివాడ, కాండ్రకోట, మర్లావ, కిర్లంపూడి మండలం రామచంద్రపురం మీదుగా భూపాలపట్నం వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. అనంతరం సుమారు 500 మంది మహిళలు తిరుపతి నుంచి ఆయా గ్రామాల మీదుగా భూపాలపట్నం వరకు క్రీస్తు సువార్త ప్రకటిస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు. దైవజనులు వంకా జాన్, కె.జయకుమార్, బ్లెస్సింగ్, పాస్టరమ్మలు నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, వంకా రూత్ ప్రశాంతి, రాయవరపు సత్య, విశాల, సునీత, మేరీ, పోలవరపు పైడిరాజు, ఎం.సత్తిబాబు పాల్గొన్నారు.



ప్రపంచ శాంతి ర్యాలీని ప్రారంభిస్తున్న వీరబాబు, సత్యానందం

సాంకేతిక నైపుణ్యంతో ఉపాధి పనులు

11 జిల్లాల డ్వామా అధికారులకు శిక్షణ

సామర్లకోట: మహాత్మాగాంధీ ఎన్ఆర్‌జీఎస్ ఉపాధి పథకంలో పనులు మరింత నాణ్యతగా జరగడానికి డ్వామా అధికారులు శిక్షణ ఇస్తున్నట్లు విస్తరణ శిక్షణ కేంద్రం అధికారి నిహారిక అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమ, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలో పనిచేస్తున్న డ్వామా పీడీ, ఏపీఓలకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా డ్వామాలోని అధికారులు విస్తరణ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రతీ గ్రామంలోను మొక్కలు నాటాలన్నారు. మొబైల్ యాప్‌పై అవగాహన పెరిగేలా శిక్షణ ఉంటుందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పనుల గుర్తింపు, అంచనాలు తయారు, మొక్కలు నాటడం, పుస్తకాల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈటీసీ ఫ్యాకల్టీలు బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, వి.ప్రసాద్, ఎస్‌కే మోహిద్దీన్ శిక్షణ నిర్వహించారు.



డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్న నిహారిక